# ఆరోకలికాలం

ఆ రోజు సూతమహాముని వచ్చేసరికీ కొంచెం ఆలస్యమయింది.

అప్పటికే శౌనకాది మునులతోపాటు నైమిశారణ్యంలోని సర్వ జంతుజాలమూ గున్నమామిడిచెట్ల నీడలో కూర్చుని ఎదురుచూస్తున్నారు.

సూతుడు తన దండకమండలాలని పక్కనేవుంచి శౌనకాది మునులను చూసి చిరునవ్వి ఇలా అన్నాడు. "పోయినసారి ఆరోకలికాలం ప్రసక్తి తీసుకువచ్చాం కదా. ఈసారి ఆవిషయం గురించి మాట్లాడుకుందాం"

చిన్నముని "ఎవరా ఆరోకలులు ఏమాకథ" అని అడగబోయి పోయిన కథలో అలా అడిగాను కదా మళ్ళీ ఎందుకులే అని వూరుకున్నాడు.

అతని వెనుకనే కూర్చున్న ఎర్ర కోతి అతని మనసుని చదివేసి ఒక్కసారి పళ్ళికిలించింది.

సూతుడు తన పురాణ కాలక్షేపం ప్రారంభించాడు.

"ఇంకో గంటలో న్యూయార్కు కెన్నెడీ ఎయిర్‌పోర్టులో దిగబోతున్నట్టుగా చూపిస్తున్నది, ఎయిర్ ఇండియా వారి విమానంలోని కంప్యూటర్.."

"ఏ భాషోకానీ, అర్ధం కాని సమాసాలు వాడుతున్నారు!" ఆకుపచ్చటి బుర్ర గోక్కుంటూ అన్నది చెట్టు మీది రామచిలుక తన చిలుక పలుకులతో.

శుకమహర్షి "అది ఇడ్లీలో పచ్చడి నంచుకున్నట్టుగా తెలుగులో ఇంగ్లీష్ కలిపిన భాష. చాలామంది తెలుగువాళ్ళు ఈ రోజుల్లో మాట్లాడేది అదే. కళ్ళు మూసుకుని శ్రద్ధగా విను. అదే అర్ధమవుతుంది.." అన్నాడు తను కూడా చిలుక భాషలో.

సూతుడు తన కథని ఇలా కొనసాగించాడు.

విమానంలో ప్రయాణీకులంతా ఒక్కొక్కరే న్యూయార్క్‌లో దిగటానికి సిద్ధమవుతున్నారు. ఎ వి వి ఎస్ ఆర్ ఆంజనేయులు సీటులో నించి లేచి, టాయిలెట్ లోకి వెళ్ళి, చక్కగా తలదువ్వుకుని, టై కట్టుకుని అద్దంలో ఒకసారి చూసుకున్నాడు.

"బంగారుకొండలా వున్నావురా నాయనా!" అనే వాళ్ళమ్మ గుర్తుకొచ్చింది. తెలుగు జానపద సినిమాలోని కధానాయకుడిలా "ఇన్నాళ్ళకు నీ కోరిక నెరవేరుస్తున్నానమ్మా!" అనుకోబోయి పెద్దగానే అనేశాడు.

తను పుట్టగానే, కేరుకేర్.. కేరుకేర్... మని ఏడవలేదుట. ఆరోకేల్.. ఆరోకేల్ అని ఏడిచాడుట. ఆరోజుల్లో ఆ మంత్రసానమ్మకు, ఇతని ఏడుపేమిటో అర్ధం కాకపోయినా, కనీసం ఏడిచినందుకు ఆరోగ్యంగానే పుట్టాడని సర్దిపెట్టుకుని సంతోషించిందని ఊహ తెలిసిన తర్వాత అతని బామ్మ చెప్పింది. అంతేకాదు మొట్టమొదట తను మాట్లాడినప్పుడు అందరిలా అమ్మ, అమ్మ అనకుండా అమె, అమె అన్నాడుట. ఆ మాటలు విన్నవాళ్ళు అమె అంటే అమెరికా అనిపసికట్టేసి అతని ముందుచూపు చాల ముందుకి పోయిందని గర్వపడి అతని జాతకం చూపించారుట. ఆ జాతకంలో అన్ని గదులతో పాటూ, అమెరికా మాప్‌లాంటి ఒక పెద్ద గది కూడా కనిపించిందిట. అతని నివాసం ఇక ఆ గదిలోనే అనిచెప్పాట్ట ఆ జాతక బ్రహ్మ. అంతేకాదు అతని చేతి లోని భవిష్యత్తు రేఖ హైద్రాబాద్‌నించీ న్యూయార్క్‌దాకా, విమానంవెళ్ళే దారిని చూపిస్తున్నట్టుగా కూడా వుందిట. అతని ఇంటి పేరు ఎ అంటే అమెరికా అనీ, అట్లూరి కాదనీ అతనికి మొదటి నించీ నమ్మకం కూడాను.

టాయిలెట్ తలుపుమీద ఎవరో మెల్లగా కొడుతుంటే మళ్ళీ మామూలు ప్రపంచంలోకి వచ్చాడు. బయటకు వచ్చి తన సీట్లో కూర్చున్నాడు. అయినా అతని ఆలోచనలు హైద్రాబాద్‌లోని చెరుకు రసం బండి దగ్గర ఈగల్లా ముసురుకుంటున్నాయి.

అతనికి వీర వెంకట సీతారామాంజనేయులు అని పేరు పెట్టారు తల్లిదండ్రులు. స్కూల్లోనూ కాలేజీలోనూ అందరూ అతన్ని ఎటుజడ్‌లు అని పిలిచేవాళ్ళు. అతను మాత్రం అమెరికాలో అమెరికన్లు పిలవటానికి అమరికగా వుంటుందని, ఎ.వి.లు అని తనోఎరుని చిన్నది చేశాడు.

డొనేషన్‌కట్టి మెకానికల్ ఇంజనీరింగ్ పాసయాక, ఎలాగో అమెరికా వెడతానుకదాఅని ఎక్కడా ఉద్యోగ ప్రయత్నం చేయలేదు. అమెరికాలో ఉద్యోగాలకెన్నో ప్రయత్నాలు చేశాడు కానీ, వాళ్ళకి ఇతని జాతకం గురించి తెలియనందు వల్ల, ఏమీ ప్రయోజనం కనిపించలేదు. రెండు కంపెనీల నించి మాత్రం, నువ్వెంతో తెలివైనవాడివే అయినా మా కంపెనీలో నీకు తగ్గ పనులేవీ లేవనీ, అలాటి పనులున్నప్పుడు పిలుస్తామ

నీ మర్యాదగా ఒక ఉత్తరం వ్రాశారు" సూతుడు కథ చెప్పటం ఆపి కమండలంలోని నీళ్ళు గడగడా తాగాడు.

చిన్న ముని "ఒక పాత తెలుగు సినిమాలో అల్లు రామలింగయ్య ఏమీ పనిచే యకుండా, అందర్నీ ఆనకరా.. ఆనకరా... అంటుంటాడు. అలాగన్న మాట" అన్నాడు.

శుకమహర్షి "నీకెలా తెలుసు ఆ సినిమా విషయాలు" అని అడిగాడు చిన్న మునిని అనుమానంగా చూస్తూ.

"తపస్సు చేసుకుంటున్నప్పుడు విసుగు పుట్టినప్పుడల్లా దివ్యదృష్టితో తెలుగు సినిమాలు చూస్తుంటాను... అప్పుడప్పుడూ మాత్రమే సుమా..." అన్నాడు చిన్న ముని ఏమాత్రం అసత్యం పలకకుండా.

సూతుడు అతని నిజాయితీకి సంతోషించి పెద్దగడ్డంలోనించి చిన్నగా చిత్తూరు నాగయ్యలా నవ్వి "అలాగే అనుకో నాయనా.... ఇంతకీ మనమెక్కడున్నాం" అని అడి గాడు.

"న్యూయార్కు కెన్నెడీ విమానాశ్రయానికి ఒక అరగంట దూరంలో..ఆంజనే యులు ఆలోచనలలో....." చటుక్కున అన్నాడు చిన్న ముని.

సూతుడు తల ఆడించి శౌనకాది మునులతో ఇట్లా అన్నాడు.

"మన ఆంజనేయులు అప్పుడేం చేశాడంటే, తను అమెరికా వెళ్ళేదెలాగా అని గట్టిగా ఆలోచించాడు. అప్పుడే ఎదురయాడు అతని స్నేహితుడు పిఎమ్మెల్ గన్. అంటే పేరూరి మహాలింగం. అతనొక సలహా ఇచ్చాడు.

"చూడు లు! నేను పుట్టగానే కేర్, కేర్ మనే ఏడిచాను. మొట్టమొదటగా అచ్చ మైన తెలుగులోనే అమ్మా.. అమ్మా అని పిలిచాను. నా జాతకంలో అమెరికాలో నివాస యోగ్యమైన గదులు లేనే లేవు. అదీకాక నా భవిష్యత్తు రేఖ హైద్రాబాదు నించీ హనుమ కొండ దాకా కూడా లేదు. అయినా నేను అమెరికా వెడుతున్నాను.."

"ఎలా.. అదెలా సాధ్యం.." ఆశ్చర్యంతో నోరు తెరిచాడు లు.

"అమెరికా వెళ్ళటానికి కావలసినవి అవేమీ కాదు. మెరికలాటి కుర్రవాడు అంటారు చూశావా.. ఆ మెరిక లాటి గుణమన్న మాట"

"అది నాకు వుందని ఎలా తెలుస్తుంది. అదున్నా, దాన్ని ఉపయోగించటం ఎలా?"

"ఎలాగా! ఇది ఆరోకలికాలం. అంటే ఐదు తరువాత వచ్చే ఆరు కాదు. అలా అయితే మిగిలేది ఆరు తరువాత వచ్చే ఏడు.. పు! ఇంజనీరింగ్ కాలేజీలో పాసవటానికి పిండి కొడతామే, ఆ రోకలి కాలం కూడా కాదు. ఆరోకల్ అనే సాఫ్ట్‌వేర్ ప్రోగ్రాం. ఆజ్

కల్ అమెరికా పోటానికి అదే అవకాశం. ఈ ఆరోకలికాలం కలకాలం వుంటుందో లేదో నాకు తెలీదు. అందుకని ఆరునెలల్లో ఆరోకిల్ నేర్చుకుని ఆరోకిల్ విద్వాంసుడ్నయి పోయాను. మనూళ్ళోనే రాంబాణం టెక్నాలజీస్ అనే ఒక అమెరికన్ కంపెనీ వుంది. వాళ్ళు అమెరికాలోని, మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ అనే ఊళ్ళో వుంటారు. బాణం రామనాథంగారు స్థాపించిన కంపెనీ అది. ఆయన భారతదేశంలోని సాఫ్ట్‌వేర్ నిపుణులని అమెరికాకి ఎగుమతిచేసి అక్కడ ఉద్యోగాలిప్పిస్తాడు. మనవాళ్ళు చాలమంది అలాగే వెడుతున్నారు. నేను కూడా, రేపు... రేపు అంటే రేపు కాదు! రేపు పదిహేనోతారీకు... అంటే వచ్చే నెల పదిహేనో తారీకు, అమెరికా వెళ్ళిపోతున్నాను" అన్నాడు పిఎమ్మెల్ గన్.

కృష్ణుడి మాట విన్న అర్జునుడిలా, గన్ మాటలు విన్న లు, వెంటనే హైద్రాబాద్ హైటెక్నాయుడూస్‌లో గబగబా ఆరోకిల్ ప్రోగ్రాం ఆరునెలల్లో చదివేశాడు. గబగబా చదివినందుకు వాళ్ళు డబ్బులు కొంచెం ఎక్కువగానే తీసుకుని, సర్టిఫికేట్ మాత్రం అందరికీ ఇచ్చే సైజుదే ఇచ్చారు. రాంబాణం టెక్నాలజీస్, ఆంజనేయులుకీ రాంబాణానికీ యుగయుగాల సంబంధముంది కాబట్టి, లక్షా ఏభై వేలు మాత్రం తీసుకుని హెచ్‌వన్ వీసా తెప్పించారు. కట్నం డబ్బుల్లో మిగిలిన యాభై వేలు పెట్టి డెట్రాయిట్‌కి టిక్కెట్టు కూడా కొన్నాడు లు. ఇప్పుడు తను చిన్నప్పటినించీ కలలు కంటున్న అమెరికాలో కుడిపాదం పెట్టబోతున్నాడు.."

"భూగోళం మీద ఇండియా ఇటు అయితే, అమెరికా అటు వున్నది. అదీకాక భారతదేశంలో కుడి, అమెరికాలో ఎడమ అవుతుంది. కారులో స్టీరింగ్ వీల్ లాటివన్న మాట. మరి అమెరికాలో మొట్టమొదటగా దిగేటప్పుడు కుడి పాదం పెట్టాలా, ఎడమ పాదమా?" అమాయకంగా అడిగాడు చిన్నముని.

శౌనకుడు సముద్రాల రాఘవాచార్యలా నవ్వాడు. "కుడి ఎడమలు మారితే పొరపాటు లేదు నాయనా. అమెరికాలో గెలుపు ముఖ్యం కనుక, ఓడిపోకుండా వుంటే అదే పదివేలు"

చిన్నముని "పదివేల రూపాయలా? డాలర్లా?" అనబోయి, శౌనకుడు తిడతాడేమోనని ఊరుకున్నాడు.

శుకమహర్షి "మన భోజనాలకి సమయం ఆసన్నమవుతున్నది. ఈ ఆరోకలి కాల పురాణం త్వరలో పూర్తి చేస్తే మనం ఆత్మారాముడిని కుసింత శాంత పరుచుకో వచ్చును కదా మునివర్యా!" అన్నాడు.

"లెస్సగా పలికావు. ఇక స్పీడుగా వెడదాం!" అని సూతుడు, శౌనకాదిమును

లతో ఇట్లా అన్నాడు.

"న్యూయార్క్‌లో దిగి డెట్రాయిట్‌వెళ్ళే విమానం ఎక్కినప్పుడు ఇంకో ఇద్దరు ఆరోకిల్ భారతీయులు కలిశారు ఆంజనేయులుకి. ఆ ముగ్గురినీ డెట్రాయిట్‌లో రామనాథంగారి భార్య సీతామహాలక్ష్మి రిసీవ్ చేసుకుని వాళ్ళ ఎపార్టుమెంటుకి తీసుకు వెళ్ళింది. దారిలో ఆవిడ తన పేరు సీత బాణం అనీ, రాంబాణం టెక్నాలజీస్‌కి ఆపరేషన్స్ డైరెక్టర్ననీ చెప్పింది. ఆంజనేయులుకి అమెరికావచ్చిన ఉత్సాహంలో ముందు కుడికాలు పెట్టాడో ఎడంకాలు పెట్టాడో గుర్తులేదు కానీ అక్కడ అంతా శుభసూచకంగా కనపడింది.

సీత దారిలో చెప్పింది. "మీ అందరికీ కలిపి ఒక ఎపార్టుమెంటు ఇస్తున్నాం. మీకు ఉద్యోగం వచ్చేదాకా అక్కడే వుంటారు. దానికి అద్దె మేమే కడతాం. భోజనాలు కూడా మేమే పెడతాం. ఇంటర్వ్యూలు ఇప్పిస్తాం. ఉద్యోగా లు తెప్పిస్తాం. ఓకే?"

ఏనాటి బంధమోకానీ రాంబాణం కంపెనీలో సీతమ్మ తల్లి ఆదరణ. అందులోనూ అమెరికాలో. నువ్వు అదృష్టవంతుడివోయ్ ఆంజనేయులూ అనుకున్నాడు.

ఆ మూడు గదుల ఎపార్టుమెంటులో మొత్తం పదిమందికి వసతి కల్పించారు. అందరికీ స్లీపింగ్ బాగ్‌లు ఇచ్చారు. కిచెన్‌లో బియ్యం, పప్పులూ, పోపు సామాన్లూ వున్నాయి. వంట వచ్చిన వాళ్ళు వంట చేయాలనీ, రానివాళ్ళు అంట్లు తోమాలనీ, గదులన్నీ వాక్యూమింగ్ చేయాలనీ, బాత్రూములు కడగాలనీ అక్కడ రూలు.

ఆ పదిమందిలోనూ నలుగురు తెలుగువాళ్ళు. ఆనలుగురిలోనూ నారాయణ అనబడే ఒక విశాఖపట్నం కుర్రాడు ఆంజనేయులుతో అన్నాడు. "నేనిక్కడికి వచ్చి మూడు నెలలయింది. ఇప్పటికి నాలుగు ఇంటర్వ్యూలు మాత్రమే వచ్చాయి. అయినా ఒక్క చోటా ఉద్యోగం రాలేదు.."

"అదేమిటి.. వీళ్ళు వెంటనే ఉద్యోగం ఇవ్వరా.."

"రాంబాణం కంపెనీ ఉద్యోగాలివ్వదు. మనకి వాళ్ళ కంపెనీ తరఫున ఇంటర్వ్యూలిప్పిస్తారు. మనకి ఉద్యోగం వచ్చే దాకా ఎదురు చూట్టాన్ని బెంచీ మీద కూర్చోవటం అంటారుట.."

చిన్నమునికి మళ్ళీ ఇంకో అనుమానం వచ్చింది. "బాగా చదవకపోతే స్కూళ్ళల్లో బెంచీ మీద... నుంచో పెడతారే.. అలాగన్నమాట.."

శౌనకుడు విసుక్కున్నాడు. "ఇలా మాటిమాటికీ అడ్డం వచ్చావంటే నేను వెళ్ళిపోతాను. అన్నీ పిచ్చి ప్రశ్నలూ! పిచ్చి మాటలూనూ!" అన్నాడు.

"మీరు చెప్పండి! ఈ కుర్రకారు కారుకూతలకేమిటి" సూతుడితో అన్నాడు.

సూతుడు నొప్పి పెడుతున్న తన ముంజేతికి కరదండాన్ని ఆధారంగా వుంచి,

కథ కొనసాగించాడు.

"బెంచీ మీద కూర్చోవటమన్నది అమెరికాలో వాడే పదం కాదు. అమెరికాలోని ఇలాంటి ఇండియన్ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వాడే పదం, పద్ధతి అన్నమాట..."

నారాయణ ఆంజనేయులుతో అన్నాడు. "మన రెస్యూమేని... అదే బయోడేటాని... ఇక్కడి కంపెనీలకు పంపిస్తారు. వాళ్ళకి నచ్చితే మనకి ఉద్యోగాలు వస్తాయి. ఉద్యోగం వస్తే, మనం పనిచేసే ప్రతి గంటకీ ఇంత అని పే చేస్తాయి ఆ కంపెనీలు. మనకి వచ్చే జీతంలో దాదాపు ముప్పై శాతం రాంబాణం టెక్నాలజీస్ తీసుకుని మిగతాది మనకి ఇస్తారు. ఇది అమెరికాలో మామూలుగా జరిగేదే. దాన్ని జాబ్ షాపింగ్ అంటారు"

"ఉద్యోగం రాకపోతే?" అడిగాడు లు.

"రాకపోతే అమెరికన్ ఇమ్మిగ్రేషన్ డిపార్టుమెంట్ వాళ్ళు ఇండియాకి పంపించేస్తారు. తిరిగిపోవటానికి ఖర్చులు మనమేపెట్టుకోవాలి. నాకు ఇంతవరకూ ఉద్యోగం రాలేదు. రేపు రెండు వేల సంవత్సరం రాగానే వైటుకె ఉద్యోగాలన్నీ అయిపోతాయి కూడాను..."

"అయితే.. ఉద్యోగం రాకపోతే మీరు వెనక్కి వెళ్ళిపోవాలా?"

అతను నిట్టూర్చి అన్నాడు "అంతేకదా మరి. అయినా ఇన్నిలక్షల రూపాయలు ఖర్చు పెట్టాక ఏ ముఖంతో ఇండియాకి తిరిగి వెడతాను. ఇక్కడే ఏ షాపులోనో, హోటల్లోనో చేరతాను. నేను వెనక్కి వెడితే, అప్పుల్లో మునిగిపోయి వున్నమా నాన్న, అమ్మ భరించలేరు" అతని గొంతు బొంగురుపోయింది.

"అంతదాకా వస్తుందని నేను అనుకోను. మీకు త్వరలోనే ఉద్యోగం వస్తుంది" అలా అన్నాడేకానీ తన జీవితం ఏమయిపోతుందోనన్న భయం ఒక్కసారి అతని వెన్నెముకలో వణుకు పుట్టించింది. రెండు నిముషాలాగి లు అడిగాడు. "ఇలాటి కంపెనీలు కొన్ని, అమాయకులైన మనలాటివారిని మోసంచేస్తుంటాయని అంటారు.. నిజమేనా?"

"అవును! ప్రతివిషయంలోలాగానే, ఇక్కడా చెడ్డవీవున్నాయి. మంచివీ వున్నాయి. నాకు తెలిసి, ఇలా వచ్చినవాళ్ళు కొందరిక్కడ మంచి ఉద్యోగాల్లో వున్నారు. ఎన్నోడబ్బులు ఖర్చుపెట్టుకుని శ్రమపడి ఇక్కడికి వస్తారు కనుక చాల కష్టపడి పనిచేస్తారు. అంతేకాక మనవాళ్ళకి మంచి తెలివితేటలున్నాయి. అవసరమైన వేరే కోర్సులు కూడా తీసుకుని వాళ్ళ పరిధిని పెంచుకుంటున్నారు. అలాగే మనవాళ్ళ కంపెనీలే కొన్ని వీళ్ళను అన్యాయం చేసి, వీళ్ళ నోళ్ళు కొట్టి డబ్బులు చేసుకుంటున్నాయి"

"మరి మన ఆరునెలల చదువూ, ఇక్కడి కంపెనీలలో పనిచేయటానికి సరిపోతుందా?" అడిగాడు లు.

"సరిపోదు. ఇండియాలో మంచి కాలేజీల్లో కంప్యూటర్ ప్రోగ్రామింగ్‌లో డిగ్రీ తీసుకున్న వాళ్ళకు ఈ పనులేవీ కష్టమైనవి కాదు. ఇక్కడి ఆఫీసు పద్ధతులకీ వాతావరణానికీ అలవాటు పడితే చాలు. ఈ ఆరు నెలల కోర్సులు తీసుకున్న వాళ్ళు మాత్రం చాల కష్టాలు పడతారు. ఇక్కడి కంపెనీలకు మనమేం చదివామని కానీ, మన స్వర్ణ యుగ చరిత్ర కానీ అవసరంలేదు. మనమెంత పని చేయగలం, మన పని వల్ల కంపెనీకి లాభాలు ఎంత వస్తాయి అని మాత్రమే చూస్తారు.వాళ్ళకి లాభాలు పెరుగుతుంటే మనకి డబ్బులు బాగానే ఇచ్చి ప్రోత్సాహమిస్తారు. మనవల్ల ఏమీ ఉపయోగం లేకపోతే ఇంతే సంగతులు.."

"మరి మీకు త్వరలో ఉద్యోగం వస్తుందా?"

"వస్తుందనే ఆశ. ఎప్పుడో ఆరుద్రగారన్నట్టు ఆశ మానవ జీవితానికి శ్వాశ. రాకపోదు...." నారాయణ మాటల్లో అటు ఆశా లేదు, ఇటు నిరాశా లేదు.

"లేదు. మీకు తప్పకుండా వస్తుంది. మనిద్దరికీ ఇక్కడ మంచి భవిష్యత్తువుందని నా నమ్మకం" అన్నాడు ఆంజనేయులు, తన శక్తి తనకు తెలుసు కనుక. దానికి తోడు అతని చేతిలో అమెరికా రేఖ జెర్రిపోతులా వెర్రిగా అర్రులు చాస్తున్నది కూడానూ.

వెనుకగా కూర్చుని కథ వింటున్న తెల్ల ఆవు ప్రేగులు, ఆకలితో ఆవురావురుమంటున్నాయి.

చిన్నముని "ఏమిటీ.. ఆరోకిల్.. ఆరోకిల్ అని అరుపులు వినిపిస్తున్నాయి.." అన్నాడు వెనక్కి తిరిగి.

సూతుడు చిరునవ్వి "ఆరోకిల్ కాదు నాయనా! ఆకలి. ఆకలి అవుతున్నదని ఆ ఆవు ఆవురావుర్రంటున్నది. ఈ కథనింతటితో ఆపమని చెప్పకనే చెబుతున్న సంకేతమది! " అని లేచి నుంచున్నాడు.

శౌనకాది మునులు కూడా లేచి, పట్టేసిన మోకాళ్ళు కట కటా శబ్దంచేస్తుంటే ఒకసారి ఒళ్ళు విరుచుకుని, కందమూలాల కోసం కదలీఫలాల కోసం కదిలారు. ✿